# అమ్మయ్య... పెళ్లయ్యింది

- వలివేటి నాగచంద్రావతి

**వా**గ్ధాటి వేరు. వాక్చాతుర్యం వేరు. వాగుడు వేరు. మా భ్రమరాంబ అత్త ధోరణి ఈ మూడిట్లో ఏ కోవకి చెందుతుందో నాకిప్పటికీ అంతుపట్టదు.

"ఓసి నువ్వుటే విశాలా! గుర్తుపట్టనే లేకపోయేనుస్మీ. రెండేళ్లనాడేగా నిన్ను చూశాను... ఇంతట్లోకే చెంపలు నెరిసి, బుగ్గలు లోతుకెళ్లి ముసలి డొక్కులా అయిపోయినావేమిటే- అన్నట్టు ఇది నీ కూతురేనా? ఎప్పుడో చిన్నప్పుడు దిశమొలతో తిరిగేటప్పుడు చూశాను. అబ్బో! బాగా ఎదిరిపోయిందే! పెద్ద చదువు చదివిందటగా... పెద్ద పిల్లలకే పాఠాలు చెబుతుందటగా... విన్నాలే... ఏదో సామెత చెప్పినట్టు పిచ్చి మొక్కకు ఔషదగుణ మబ్బిందన్నమాట. సెబాసూ-" ఎం. ఫిల్. చేసి లెక్చరర్‌గా జాబ్ చేస్తున్న నన్ను పట్టుకుని భ్రమరాంబత్త అన్నమాటలివి.

నేను అవాక్కయ్యాను. ఆవిణ్ణి నేనిదే మొట్టమొదటి సారి చూడ్డం. అమ్మా నాన్నల ఉద్యోగరీత్యా ఎప్పుడో నార్త్‌లో స్థిరపడిపోయాం మేము. దూరాభారం మూలాన రాకాపోకా పరిమితమవటం మూలాన దూరబంధువులతో నాకు పరిచయాలు తక్కువే.

ఇపుడయినా మా పెదనాన్నగారి అమ్మాయి హేమ వివాహానికి అమ్మ నాన్న మన చుట్టాలనందర్నీ ఓ మారు చూద్దువుగాని రా" అని బయలుదేరదీశారు నన్ను కూడా అక్కడ ఆలా తటస్థపడిందీవిడ.

పదిమంది మధ్యన కూర్చుని ఉండగా ఆ సంస్కార రహితమైన పరామర్శకి అమ్మ కాబట్టి తన సహజసిద్ధ మయిన హుందాతనంతో చిరునవ్వు నవ్వి ఊరుకున్నదిగానీ నాకయితే తట్టుగాలి రేక్కొచ్చింది. చురుక్కుమనిపించాలని వాడిగా పెదవిదాటి బయటకు దూసుకురాబోయిన వాగ్బాణం అమ్మ కనుసైగతో ఆగిపోయింది.

"అబ్బ ఎంత అగ్లీగా మాట్లాడిందీ! ఇంతకీ యవరమ్మా ఆవిడ?" ఆమె మమ్మల్ని దాటివెళ్లాక అడిగాను.

"భ్రమరాంబ అనీ- నాకు వరసకు ఆడబడుచవుతుందిలే! మొదట్నించీ ఆవిడ నాలుక్కి పదునెక్కువే." అని తేలిగ్గా చెప్పి. "అన్నట్టు మంజూ! ఆవిడ మొంటాలిటీ అబ్జర్వ్ చేశావో- థీసెస్‌కి సిరపడా మేటర్ దొరుకుతుంది. కానీ జాగ్రత్త సుమా! ఆవిడకు దొరికేవో... అయిపోతావు" నవ్వుతూ హెచ్చరించింది అమ్మ.

అమ్మ అన్నట్టే ఆ తరవాత ఆవిడ విశ్వరూప సందర్శనాన్ని అక్కడ అడుగడుగునా వీక్షిస్తూనే ఉన్నాన్నేను.

ఓల్డ్ హవేలీ లాంటి అంత పెద్ద పెళ్లింట్లో ఎక్కడ చుసినా ఆవిడే కనిపించేది నాకు చిత్రంగా.

పెళ్లి ఇల్లు కదా! ఆ పనుల భారాన్నంతా భుజాన వేసుకుని అంతా తనే అయి చక్కబెడుతోందనుకుందామంటే, "అయ్యో రామ! ఆవిడ పని గూడా చేస్తుందా- చేసేపని పాడుచేస్తుందిగాని. వెళ్లి చూడు" అని చాటుగా నుదురు కొట్టుకుంది మా పెద్దమ్మ.

పెద్దమ్మ మాట అబద్ధం కాదు. భ్రమరాంబత్త ఎటువెడితే ఆ వైపునించి సెగలూ పొగలూను.

పిల్ల-



వంట వసారా వైపు వెళ్లిందా- "అయ్యయ్యో సుబ్బాయమ్మా! ఆ వంకాయ కూరలో పోసింది నూనా... నీళ్లా? మీ సొమ్ముకాదని కాలువలు కట్టేలా నూనె డబ్బా వంచేస్తారా? "అన్న ఆ నోటితోనే "ఓసి మీ పీనాసితనం మండిపోనూ- హల్వాలో నెయ్యసలు వేశారా... లేకపోతే వాసన

చూపించారా? మా సొమ్ములో కూడా మీ పొదుపరితనమేమిటీ?" అని దులిపేస్తోంది.

అంతటితో ఆగితే గొడవలేదు. భ్రమరాంబ గారి నెక్స్ట్ ఎంట్రీ హేమని పెళ్లికూతుర్ని చేస్తున్న గదిలోకి. హేమది పచ్చటి పసిమి ఛాయ. నాకు వర్ణించటం చేతకాదుగానీ, మెరూన్ కలర్ కంచిపట్టు చీర కట్టుకుని తలనిండుగా మల్లెలు తురుముకుని, నుదుట కల్యాణ తిలకంతో బుగ్గన కాటుక చుక్కతో, వంటి నిండా బంగారు ఆభరణాలతో హేమ ఎలా ఉందంటే- చివురులు తొడిగి, నిండుగా పూచి వసంతుని కోసం ఎదురుసూస్తోన్న లేత గున్నమావిలా.

అంతటి అందమూ భ్రమరాంబగారి కళ్లకి మాత్రం, "ఆ కాటుకా పూలు- ఓ నాజూకూ పాడూ లేకుండా అమ్మవారిలా ఏమిటా అలంకారం- జాగ్రత్త! ఈ అవతారం చూసి వచ్చే పట్నం పెళ్లికొడుకు కాస్తా వెనక్కి పరిగెట్టేను" అంటూ వికవిక నవ్వేలా కనిపించిందట.

పోనీ ఆ వెక్కిరింతతో సరిపెట్టిందా...? ఉహూ... హేమ కట్టుకున్న పట్టుచీర బార్డరులో హంసల కంటికి వేసిన నల్లరంగు నూలుపోచ ఈవిడ దుర్భిణీ కళ్లకే దొరికిపోయిందట- అంతే-

"అయ్యో.. అయ్యో.. శుభమా అని పిల్లకి పారాణీ పెట్టి, పసుపు కొట్టే శుభఘడియల్లో ఎంత అఘాయిత్యం..." అంటూ వందలాది ఆపదలేవో ఆ క్షణాన్నే మీదకొస్తున్నట్టు హాహాకారాలు చేసి, "తక్షణం ఆ చీర విప్పిస్తారా... లేదా?" అని గోలగోల చేసి అప్పటికప్పుడు నిక్షేపం లాంటి ఆ చీరని మార్పించిందాకా ఊరుకున్నది కాదు.

అదసలే సుద్ద పల్లెటూరు. అర్జంటుగా ఖరీదైన పట్టుచీర కొనాలంటే దొరకనే దొరకదు. పెళ్లికి కొన్న పట్టుచీరలన్నీ- సదస్యానికిది... నాగవల్లికి ఇది... అంటూ దేనికది వేరేవేరేగా తీసిపెట్టినవేనట.

పాపం హేమ... అప్పటివరకూ నునుసిగ్గులు ఒలికిస్తూ చిరునవ్వులు చిలకరిస్తూ కళకళలాడిన పిల్ల- ఆవిడ పుణ్యమా అని సాదా చీరతో వెలవెలబోతూ చిన్నబోయిన మొహంతో కూర్చోటం చూస్తే ఎవరికైనా చివుక్కుమనక మానదు. ఆవిడ కళ్లబడిన ఎవరైనా ఆవిడ నోటి బారినపడక తప్పించుకోలేరు, చివరికి పిల్లలకూ ఇందులో మినహాయింపు లేదు.

అసలు పిల్లలు లేకపోతే సందడేముంటుంది చెప్పండి. వాళ్లే లేకపోతే తాటాకుల పందిళ్లకింద కొబ్బరాకుల బూరలెవరూదుతారు? పకపకలాడుతూ తూనీగల్లా గదిగదికీ పరుగులు పెడుతూ అమ్మల చీరకుచ్చెళ్లు అడ్డం చేసుకుని దాగుడుమూతలు ఎవరాడతారు? పెళ్లి ఇంటికి పెళ్లికళ తెచ్చే ఆ చిన్నారి దేవతలు భ్రమరాంబగారి దృష్టిలో వానరాల దండు; రాలుగాయి మూక; అల్లరి వెధవాయిలు.

అయ్యయ్యో... గాలిదెయ్యాల్లా ఆ పరుగేమిట్రా మధూ గాడిదా. పడితే కాళ్లూ చేతులు విరుగుతాయి. జన్మంతా అవిటివాడవయి ఏడుస్తావు." "నువ్వేమిటే ధనం- ఇంట్లోనే తొక్కుడుబిళ్లాడుతున్నావు. నవ్వుతున్నావా... ఆ పరికిణీ కాళ్ల కడ్డం పడిందంటే ముందుకుపడి మూతి పళ్లిరుగుతాయి. అప్పుడణుగుతాయి... ఈ ఇకబకలూ పకపకలూను." అని వాళ్లని రాల్చిపోస్తానేవుంది. గమ్మత్తేవిటంటే ఆవిడ వెనకన పళ్లు కొరుక్కుంటూ మెటికలు విరచినవాళ్లేగానీ ఒక్కరుకూడా- 'ఇదేమిటమ్మా' అని ఎదురడిగినవాళ్లే లేరు.

• • • • •

భ్రమరాంబకి చిన్న వయసులోనే భర్తపోయేడు. బోలెడంత ఆస్తి మిగిల్చి పిల్లా పాపాలేరు. చుట్టూరా రాబందుల్లాంటి దాయాదులు. స్వతహాగా తెలివిగలదవటాన ధైర్యంగా వాళ్లతో పోరాడి ఆస్తి నిబెట్టుకుంది. అంత సంపదా వెంట తీసుకుని పుట్టింటికి చేరుకుంది. పేదరికానికి దగ్గరగా ఉన్న పుట్టింటివాళ్లు ఆమెను నెత్తిన పెట్టుకున్నారు. ఇంటి పెత్తనం చేతికిచ్చారు. ఆవిడ గీసిన గీటు దాటని విధేయత కనబరిచారు.

"అసలే గడుసరి ఆపైన గెలుపొందిన అనుభవాలు తెచ్చిపెట్టిన ఆత్మవిశ్వాసం. కొద్దిగా అహంకారం. చుట్టూరా భయభక్తులతో ఒదిగిన స్వజనాలు. ఇవన్నీ కాక ఐశ్వర్యం... ఇన్ని క్వాలిఫికేషన్స్ ఉన్న మనిషి సౌమ్యగుణం కలవాడయితే అదనంగా హుందాతనం కూడా అబ్బి గొప్ప హృదయం కలవాడవుతాడు. తీక్షణ మనస్తత్వమయితే ఇదిగో ఇలాగే తయారవుతారు."- అమ్మ విశ్లేషణ.

"ఏది ఏమయినా ఇలా చిన్నచిన్న గాలివానలయితే ఫరవాలేదు. ఎలాగో తట్టుకోవచ్చు ఆవిడ వెళ్లేలోగా ఏ 'సునామీ' నో లేవదీయకపోతే బతికిపోయామన్న మాటే!" అమ్మ మాట పూర్తికాలేదు- సావిట్లోంచి పెనుకేక; ఉరుము ఉరిమిన శబ్దం. "ఏవిటీ... ఈ వేళ్టికి నాలుగోరోజా- ఖర్మ ఖర్మ ఆపండి. ఎక్కడి పనులక్కడ ఆపేసెయ్యండి. మయిల ఇంట ముహూర్తమెలా జరుపుతాం?" అది భ్రమరాంబగారి కంఠ స్వరమే.

మరుక్షణం యావన్మందిమీ సావిట్లో ఉన్నాం. "ఏమిటీ? ఏమిటీ?" అంటూ.

"ఏమిటేమిటి. గోవిందరాజులు పోయాట్ట. ఈ వేళ్టికి నాలుగో రోజేనట."

'ప్రపంచయుద్ధం మొదలై నాలుగో రోజు. నీకింకా తెలీదా? అన్నట్టు మా అజ్ఞానికి జాలిపడుతున్నట్టుంది

భ్రమరాంబగారి వదనం.

"గోవిందరాజెవడు? అతను పోతే మనకేమిటి?" నుదురు చిట్లించి విసుక్కున్నారు పెదనాన్న.

"ఎవరో కాదురా. అతను మీ బంధువే! దూరపు చుట్టరికమనుకుంటాను. బహుశా తరాలు గడిచిపోయుంటాయి. అందుకే నీకు తెలుసుండదు...'

"అది సరే. ఇంతకీ నువ్వనేదేమిటీ?" మధ్యలోనే అడ్డ తగిలి నిర్లక్ష్యంగా ప్రశ్నించిన ఆ తీరు భ్రమరాంబగారికేమీ నచ్చినట్టు లేదు.

"ఏమిటా? వాడు... అంటే ఆ పోయినవాడు మీ ఇంటిపేరిటి వాడు. మీ గోత్రీకుడు. మీకిప్పుడు సూతకం. ఇక పెళ్లెలా చేస్తావ్?" శాస్త్రి చేశాను చూడు అన్నట్టు- పిడుగులాంటి సమాచారాన్ని జారవిడిచింది.


బిత్తరపోయామందరం.

"ఏమిటత్తా నువ్వు? ఇంటిపేరు ఒకటయినంత మాత్రాన ముక్కూ మొహం తెలీని వాడెవడో పోతే మేము సూతకం పట్టాలా? గంటల్లోకొచ్చిన పెళ్లి ఆపాలా? నీకుగాని మతిపోయిందేమిటి?" మా పెదనాన్నగారి పెద్దబ్బాయి చైతన్య గయ్యిమన్నాడు.

"నోరు ముయ్యరా- కుర్రకుంకా! ఇంటిపేరంటే ఏవిటనుకున్నావ్! ఎంత దూరాన్నున్నా ఏ బంధుత్వమూ లేకపోయినా వాళ్లు మీ కుదురువాళ్లని అర్థం. ఈ నమ్మకాలూ పద్ధతులూ ఎప్పట్నించో ఉన్నవే... నీకేం తెలసని మాట్లాడుతున్నావ్? ఎదుటివాళ్లు నోరెత్తకుండా గొంతు పెంచెయ్యటం ఆవిడ టెక్నిక్ అనుకుంటాను.

"వాడిమీదెందుకే అలా అరుస్తావ్ భ్రమరా! వాడన్నదాన్లో తప్పేముంది చెప్పు" ఆవిడ దూకుడుని పెదనాన్నగారు అడ్డుకుంటూ సమాధానపరచబోయారు. "పోయిన మనిషి మనకెలాటి చుట్టమో... నీకన్నా సరిగ్గా తెలియదు. ఆయన ముక్కూ మొహం మేమెరగం. నువ్వూ చూసుండవ్. ఇంతోటి దానికి పెళ్లాపుకోవాలా? మయిల పట్టాలా? ఏమిటక్కా... ఈ రోజుల్లో కూడా ఇంత చాదస్తం..."' పెదనాన్న గట్టిగానే నిరసన వ్యక్తంచేశారు.

"అయితే ఇప్పుడేమంటావ్" ? ఆమీతుమీ



తేల్చుకోడానికి ఆవిడా దృఢంగానే ఉన్నట్టుంది.

"అనేదేవుంది. మొదట అలాటి సంగతి విన్నదావి నువ్వే కడుపులో దాచుకుని మరిచపోవాల్సింది. ఇప్పుడు మాత్రం ఏమయింది? అన్ని యథావిధిగా జరిగిపోతాయి" నెమ్మదిగా అన్నారు పెదనాన్న పరిష్కారం నిర్ణయించేసి.

"ఏమిటీ? నేనెలా మెదలకుండా ఉండగలననుకుంటున్నావ్ నువ్వు? పెళ్లికొడుకు సాయాన మా ఆడబడుచు తోడికోడలికి తమ్ముడు. వాళ్లెంతో ఆచారవంతులు. రేపు ఇదేవన్నా తెలిసిందా- ఏమిటమ్మా- నువ్వుండీ ఇలా చేయించావు'" అని నన్నరా? ఇదిగో హరీ! ఇంకాసేపట్లో వాళ్లు బయలుదేరుతారు. ఇప్పుడే ఇదీ సంగతీ అని- నాకు చెప్పిన మాటే వాళ్లకీ కబురు పంపించు. ఆ అనాచారం వాళ్లకిష్టమయిందా వస్తారు- లేదంటే లేదు. తీరా వచ్చాక నువ్వు నోరు విప్పావంటూ నన్ను తప్పుపట్టి ప్రయోజనం లేదు" కఠోరంగా తన నిర్ణయాన్ని తేల్చి చెప్పేసింది.

"భ్రమరాంబా... మజాకా...?" ఎవరో గొణుగుతున్నారు. పెదనాన్నగారు నీరసమొచ్చినట్టుగా అయిపోయేరు. పెదమ్మయితే బిక్కమొహంతో ఏడుపుకు సిద్ధమయింది.

ఎవరికయినా అది బాధాకరమైన పరిస్థితే కదా! చుట్టూ ఎటుచూసినా రాత్రి జరగబోయే పెళ్లి కొరకు సంసిద్ధమవుతోన్న సంరంభమే. తాటాకు పందిళ్లకి దీపతోరణాలు అమరుస్తున్నారు ఎలక్ట్రీషియన్లు. సన్నాయిమేళం వాళ్లు పొద్దుటేవచ్చి కూర్చున్నారు. చివరికి పురోహితుడు సయితం హాజరుగా ఉన్నాడు. ఇలాటి తరుణంలో పెనుముప్పులా వచ్చిపడిందీ చిక్కు వచ్చిన బంధువుల్లో కూడా ఓ సందిగ్ధత. కొందరు భ్రమరాంబ గారికి నచ్చచెప్పే ప్రయత్నంలో ఉంటే- మరికొందరు 'ఏవో- ఆవిడన్నదీ ఆలోచించాల్సిన విషయమేనేమో' అంటున్నారు.

మరోవైపు దిగే చుట్టాలు దిగుతూనే ఉన్నారు.

* * * * *

"పెళ్లివారిల్లేనా ఇదీ... సందడే లేదేమే!" గూడు రిక్షాబండి దిగి పాతకాలం ట్రంకు పెట్టొకటి మోసుకుంటూ ద్వారం ముందు మెట్లెక్కి వచ్చిన ఓ బరువైన శల్తీని చూస్తూ 'హతోస్మి' అన్నది అమ్మ.

"అదేం"

"ఏమి చెప్పమంటావ్? వచ్చినావిడని చూశావా? కామాక్షమ్మ. ఆడ నారదుడనుకో. భ్రమరాంబకి డీటో. వీళ్లిద్దరూ ఒకచోట కలిశారంటే ఇంకేముంది- అగ్నికి ఆజ్యం తోడయినట్టే. ఇక ఈ ముహూర్తానికి నీళ్లొదులుకోవాల్సిందే" ధ్వని పైకి రాకుండా చెప్పి ధ్వని లేకుండా నిట్టూర్చింది అమ్మ.

"ఓహో భ్రమరమా... ఒచ్చేవూ... అనుకుంటూనే ఉన్నాను. నువ్వుంటేనే గద.. పందిరికి కళకళ- నువ్వు మంత్రం వేస్తేనే గద... ఆ పందిరి వెలవెల" కామాక్షమ్మ గారి చమత్కార ధోరణి వినిపిస్తోంది.

"ఇది మరీ బావుంది. నేనేం చేశానూ?"

భ్రమరాంబగారి దీర్ఘాల మండిపాటు.

"అదికాదు కామాక్షి పిన్నీ- ఎవరో గోవిందరాజనీ- ఈ ఇంటిపేరిటతను- నాలుగు రోజుల్నాడు పోయేట్ట. భ్రమరాంబ వదనకెవరో చెప్పార్ట" ఎవరో వివరమందించేరు.

"ఎవరో ఏమిటే నిద్రమొహమా- మా పిన్నత్త వరలక్ష్మి లేదూ... ఆవిడ తోడికోడలికి తమ్ముడి బావమరిదేగా- ఆతను పోయాడని నాకూ తెలుసును. సరే పోయాడు. అతను ఈ ఇంటిపేరిటివాడెలా అయ్యేడూ?"

"అతన్ని దత్తు తీసుకున్న శివశర్మ గారి ఇంటిపేరేమిటంటావ్- నాకు తెలీకడుగుతున్నాలే" భ్రమరాంబగారి వెటకరింపు.

"అదేమరి- మిడిమిడి జ్ఞానమంటే. నువ్వెప్పుడూ ఇంతేనే భ్రమరం. సగంసగం తెలుసుకుంటావ్- అంతా కంఠోపాఠమయిందని విర్రవీగుతావ్. చివరాకరికి కూసం విరిగి కుదేలవుతావ్. అందుకేనే నాకు నువ్వంటే పిచ్చి జాలీ అభిమానమూనూ."

కామాక్షమ్మగారు భ్రమరాంబగారిని వెక్కిరిస్తోందో... నిజంగానే సానుభూతి చూపిస్తోందో తెలీలేదు.

"నా అజ్ఞానానికి తీరుబాటుగా తరవాత విచారం ఒలకబోద్దురుగానీ, తమరు కనుగొన్న సంపూర్ణ సత్యాలు వెల్లడించి మమ్మల్ని ధన్యుల్ని చెయ్యండి." భ్రమరాంబగారు తీసిపోలేదు.

చెక్క కుర్చీకి సరిపడా కుదిమట్టంగా కూర్చున్న కామాక్షమ్మగారు కాలుమీద కాలేసుకుంటూ రీవిగా వన్నింది చెబుదునా? అంటూ.

"శివశర్మ- వరదరాజుని దత్తత తీసుకోలేదు. దగ్గరకి తిసి పెంచారంతే."

"ఎందువల్లో?" ఎవరిదో సందేహం.

"ఎందువల్లనంటే- వరదరాజుని కన్నతల్లి పురిట్లోనే కన్నుమూసింది. శివశర్మ భార్య వరదరాజుకి పినతల్లే. అప్పటికింకా పిల్లలు పుట్టని కారణంగా ఆ పసికందుని తీసికెళ్లి సాకింది. దరిమిలా... ఆవిడకీ పిల్లలు కలగటంతో వరదరాజుని దత్తత తీసుకోలేదు. అలాని వదలనూ లేదు. దత్తు తీసుకోకపోయినా పెద్దకొడుకులానే పెంచారు. ఆస్తి రాసిచ్చారు. అదీ సంగతి. అంచేత- ఈ పెళ్లి ముహూర్తానికేమీ ఢోకాలేదు, లేవండి. ఎవరి పనులు వాళ్లు చేసుకోండి" కామాక్షమ్మగారు చక్రమడ్డువేసిన ఆడ విష్ణుమూర్తిలా అభయహస్తం చూపించేసింది.

ఆ మాటతో ఊపిరొచ్చినట్టు, మబ్బులు తొలగినట్టు అయింది. అందరి మొహాల్లోకీ వెలుగు తొంగిచూసింది. తిరిగి సందడి రాజుకున్నది.

'ఏమో! ఇదంతా నాకేం తెలుసు? పెంపకం కొడుకుంటే దత్తత తీసుకున్నారనుకున్నానంతే. నయం ఈ పెళ్లాగిపోయి ఆ నింద నామీదెక్కడ వేసాపుతారో అని ఇందాకణ్నించీ విసుక్కుచస్తున్నాను. రక్షించావ్ తల్లీ" భ్రమరాంబ గారు గమ్మత్తుగా తప్పుకోజూసింది.

"నాకు తెలుసే భ్రమరం. నువ్వొట్టి అమాయకురాలివని. అగ్గిపుల్ల అడ్డంగా ఉంది గదా అని విసిరేశాననుకుంటావు. కానీ అది అగ్గి ముట్టిస్తుందని మరిచిపోతావ్. ఉత్త పిచ్చిమాలోకానివీ" కామాక్షమ్మ తొడగిచ్చి జోల పాడుతోంది.

"అంటే... అంటే... నువ్వనేదేమిటే... నేను చిచ్చుముట్టించేదాన్ననే గదా నీ వాగుడు తాత్పర్యం?" భ్రమరాంబగారు రెచ్చిపోతూ అరిచింది.

"ఇది మరీ బావుంది. ఉన్నమాటంటే భుజం తడుముకుంటావేం?" కామాక్షమ్మ ఎగదోసింది.

"చాల్లే ఊరుకో, నువ్వు పతివ్రతవనా.. నువ్వెందరి సిగలు ముడిపెట్టావో నాకు తెలీదా" భ్రమరాంబ గారు కట్లుతెంచుకున్న పోట్లావయింది.

అక్కణ్ణించి మొదలయింది గంగా గౌరీ సంవాదం- పోలిక బావున్నట్టు లేదు- పామూ ముంగిసా పోరాటం.

సమ ఉజ్జీల మధ్యన పోరు రంజుగా ఉంటుంది- టీవీలో బాక్సింగ్ సీన్లు చూస్తున్నట్లు చూడగలిగితే.

"పెళ్లికూతురికి దిష్టి తగలకుండా,

పట్టుచీరలో నల్లపోగు ఉండటం చాలా మంచిది'' అని చెప్పి గౌరీపూజకి కూర్చుంటున్న హేమ చేత పంతంగా పొద్దుట భ్రమరాంబ విప్పించిన పట్టుచీరే కట్టించింది.

అలాగని కామాక్షమ్మ మంచిది. గొప్పది, భ్రమరాంబని అదుపుచేసేంది- అనే భ్రమలో పడేరు. కామాక్షమ్మా తక్కువ తినలేదు. ఆవిడ చూపించే చిన్నెలు ఆవిడా చూపించింది.


"ఆమెరికా వెళ్లనున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీరు పెళ్లికొడుక్కి పూర్వకాలం పట్టుపంచెలు తెచ్చారా?- మిమ్మల్ని అడవి మనుషుల్ని చూసినట్టు చూడగలరు జాగ్రత్త!" అని పెదనాన్నని బెదిరించేసి, "నువ్వెవర్ని పురమాయిస్తావో నాకు తెలీదు. అర్జంటుగా ఓ మనిషిని పట్నం పరగెత్తించు. రెడీమేడ్‌లో లాల్చీపైజమా తెప్పించు" అంటూ హడావిడిచేసింది.

"పెళ్లి విందులో పాత వాసనకొట్టే బూరెలేమిటి? రసగుల్లా చేయండి'' అని ఆర్డరు జారీచేసి అలిసిపోయిన వంటవాళ్లకి మళ్లీ పని పెట్టేసింది.

విడదికి ఇచ్చే ఇల్లు హోదాకి తగ్గట్టుగా లేదనీ సదుపాయాలు అంతంతమాత్రమే అనీ పెదవి విరిచింది. "ఇంకో మంచి ఇల్లు చూడు తొందరగా" అంటూ ముహూర్తం దగ్గరపడుతోన్న ఆ సమయంలో పరుగులు పెట్టించబోయింది.

కాదంటే ఈవిడేం తప్పులు పెడుతుందో పెనం మీంచి పొయిలో పడ్డట్టు ఈ బెడదేమిట్రా దేవుడా' అని డీలాపడిపోతున్నారు మా పెదనాన్న.

అప్పుడేం జరిగిందో తెలుసా- "అబ్బెబ్బెబ్బే... నువ్వుండరా తమ్ముడూ" అంటూ రంగంలోకొచ్చేసింది భ్రమరాంబ గారు. "పది గంటల్లో పెళ్లి పెట్టుకుని ఇప్పుడు పట్నమనీ రెడిమేడనీ అగ్గగ్గలాడకు. నేనున్నాగా- నీ కాబోయే వియ్యాలవారు నాకు దగ్గరవాళ్లే. పైగా నా మాటంటే వాళ్లకెంతో గురికూడానూ. అయినా శ్రీకాంత్ ఎంత కంప్యూటరు ఇంజినీరయినా పెళ్లికొడుకు పట్టుబట్టల్లోనే నిండుగా ఉంటాడు. వాడికినే చెబుతాగా" అని ధీమాగా మాట ఇచ్చింది.



"రసగుల్లానా ఎత్తుబారవూ! వియ్యాలవారి సంగలతా ఉంచి- ఊరివాళ్లకి అవి పెడితివా- పాల విరుగుడు పంచదార పాకంలో ముంచితీసిన పిండివంట అంటూ నీ పరువు తీయగలరు. నా మాట విని ఆ పుర్ణాలే చేయించు. బూరెకి చిల్లుపెట్టి కమ్మటి నెయ్యితో నింపి తింటే అదెంత పసందుగా ఉంటుందో ఆ పెళ్లివాళ్లూ రుచి చూస్తారు" పాలంటూ పంచదారంటూ తత్తరలాడుతోన్న వంటవాళ్లనీ ఆదుకుంది.

"విడిదిల్లు చిన్నదయితేనేం! అందరం అయిన వాళ్లమే. అక్కడ సరిపోనివాళ్లు మన ఇంటికే వస్తారు. ఏది ఏమయినా వాళ్లనించి మాట రాకుండా చూసేపూచీ నాది సరేనా" అని భరోసా ఇచ్చి కామాక్షమ్మ బారినించి పెదనాన్నని రక్షించింది.

ఏమయితేనేం- ఒకరిమాట ఒకరు సాగనివ్వకూడదనే పంతంలో ఇద్దరూ మాకు ఉపకారం చేసేశారు. బలాబలాలు తేల్చుకునే సందట్లో మిగతావాళ్ల జోలికి వెళ్లటం మరిచేపోయారు. వివాహం ఏ ఆటంకమూ ఆక్షేపణా లేకుండా నలక్షణంగా జరిగిపోయింది.

● ● ● ● ●

శుక్లపక్షం... పండువెన్నెల... 'ఆరుబయట డాబామీద పాన్పు వేశారు. వధూవరులిద్దరూ సిగ్గుపడుతూపూలచెండ్లాట ఆడుతున్నారు. పాన్పు చుట్టూరా చేరి వరసయినవాళ్లు వాళ్లని కవ్విస్తున్నారు వాళ్లకి కొంచెం దూరంగా నిలబడి ఇవన్నీ చిరునవ్వుతో తిలకిస్తోంది అమ్మ. ఈ సందడీని అధిగమించి కర్ణాకర్ణిగా వినబడుతోంది- పిట్టగోడకి అనుకుని తీరిగ్గా వాదులాడుకుంటున్న భ్రమరాంబా కామాక్షమ్మగార్ల వాదన.

"ఇందాక రుక్మిణమ్మ దగ్గర నిష్ఠల గురించీ అనుష్ఠానాల గురించీ ఎంత అద్భుతంగా ఉపన్యాసమిస్తున్నావూ- ఆ వెర్రిబాగుల రుక్మిణి మాటసరే, నిజంగా నేనూ అబ్బురపడిపోయాననుకో, మొన్నమొన్నటి దాకా మాటలమధ్య అక్షరం కింద ఒత్తు వస్తే- నీ నాలుక్కి నత్తి వచ్చేది. ఇంతలో నీకెంత విజ్ఞానం పెరిగిపోయిందీ?"

"ఛ ఛ. ఏం మాట అది. కాలనాటి

కందివిత్తువి, మూలంనాటి మురికి విత్తువి. నీ పరిజ్ఞానం ముందు నేనెంత చెప్పు."

'ఏమన్నావ్? పెద్దంతరం చిన్నంతరం లేకుండా వాగుతున్నావ్. నేను మురికి విత్తనాన్నా... నువ్వే కశ్మలం నిండిన గుంటవి- పాపం పెరిగిన గుట్టవి..."

"నువ్వే..."

చిన్నగా నవ్వుకుంటూ చల్లగా అమ్మపక్కకి చేరేను. "అమ్మా! వాళ్లిద్దరూ ఏకమై ఇక్కడ ముప్పుతెస్తారన్నావు కదూ?"

అయితే ఏమిటన్నట్టు ప్రశ్నార్థకంగా చూసి, అంతలోనే అర్థమై " స్వజాతి ధ్రువాలు వికర్షించుకుంటాయి కదా! నేనా సిద్ధాంతాన్ని మరిచేపోయాను స్మీ" గలగల నవ్వింది అమ్మ.

ఎప్పుడోగానీ అలా నవ్వని అమ్మని ఆశ్చర్యంగా ఆనందంగా చూశాను. ●